శ్రీ కనకధారా స్తవము - భావార్థముతో -

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ కనకధారా స్తవము

కనకధారా స్తోత్రము / కనకథారా స్తవం / సువర్ణధారా స్తోత్రం – మొదట లక్ష్మీదేవిని ప్రార్థిస్తూ జగద్గురువులు శ్రీ ఆది శంకరాచార్యుల వారిచే చేయబడింది. ఈ స్తోత్రంలో ప్రక్షిప్త శ్లోకాలు, ఫలశృతితో కలిపి మొత్తం 25 శ్లోకాలు వుంటాయి. సకల సంపత్ప్రదాయకమైన స్తోత్రం.

ఈ స్తోత్ర ఆవిర్భావం గురించి ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. ఒకనాడు శంకరాచార్యుల వారు ఒక ఇంటికి బిక్షకు వెళ్లారు. బిక్ష వేయడానికి ఆ ఇంట ఏమీ ఆహారపదార్థాలు లేవు. ఇంట ఇల్లాలు నిరు పేదరాలు. ఆమెకి కట్టుకోడానికి సరైన వస్త్రాలు కూడా లేవు. ఇల్లంత వెతికినన ఆమెకు ఎలాగో ఒక ఉసిరికాయ లభించింది. ధర్మ పరురాలైన ఆ ఇల్లాలు తలుపు చాటునుండే ఆ ఉసిరికాయను శంకరునికి సమర్పించింది. పరిస్థితి గ్రహించిన శంకరుడు లక్ష్మీదేవిని స్తుతిస్తూ కనకథారా స్తవము చెప్పగా ఆ పేదరాలి యింట బంగారు ఉసిరికాయలు వర్షించాయి.

కనక ధారా స్తోత్రానికి సంకల్పం

కమలాసనపాణినా లలాటే
లిఖాతామక్షర పంక్తిమస్య జంతోః
పరిమార్జయ మాత రంఘ్రిణాతే
ధనికద్వార నివాస దుఃఖదోగ్ధ్రీమ్

ధనికుల ఇళ్ల ముంగిట పడికాపులు కాచుమని ఆ బ్రహ్మదేవుడు ఈ హీన జీవి యొక్క నుదుట వ్రాసిన వ్రాతను దయచేసి నీ కాలితో తుడిచివేయుమమ్మా! తల్లీ! శ్రీ మహాలక్ష్మీ!

– – – × – – –

శ్రీ ఆది శంకరాచార్య విరచిత

అష్టైశ్వర్య ధన ధాన్యాది సంపదల నిచ్చు

శ్రీ కనకధారా స్తవము

గణపతి (హయగ్రీవ స్తోత్రం) ప్రార్థన

వందే వందారు మందార మిందిరానంద కందలమ్।
అమందానంద సందోహ బంధురం సింధురాఽననమ్

భక్తుల కోర్కెలు తీర్చేవాడు, లక్ష్మీదేవికి ఆనందము కూర్చువాడు, జ్ఞానుల ఆరాధ్యుడు అయిన హయగ్రీవునికి వందనము

నిరంతరము మ్రొక్కు స్వభావము గల భక్తులకు - సాధకులకు కల్పవృక్షము వంటివాడు, అఖండాద్వయానన్ద అవస్థయందున్నవాడు, శ్రీదేవికి ఆనన్దకారకుడు అయిన సిన్ధురాననునకు (గణపతికి) నమస్కరించుచున్నాను.

01. అఙ్గం హరేః పులక భూషణమాశ్రయన్తీ
భృఙ్గాఙ్గనేవ ముకుళాభరణం తమాలమ్।
అఙ్గీకృతాఖిల విభూతి రపాఙ్గలీలా
మాఙ్గల్యదాఽస్తు మమ మఙ్గల దేవతాయాః॥

నీలమేఘశ్యాముడైన హరిని తన చూపులతో చుట్టివేసిన మంగళమూర్తి, సకల సిద్ధిస్వరూపిణి అయిన శ్రీ లక్ష్మీదేవి నాకు సమస్త సన్మంగళములను ప్రసాదించును కాగ!

పులకింతలే భూషణములుగా కల విష్ణుమూర్తి శరీరము, మొగ్గలే ఆభరణములుగా కల నల్లని చెట్టు వలె ఉన్నది. సమస్త సంపదలకు నిలయమైన లక్ష్మీకటాక్షము ఆ వృక్షముపై వాలిన ఆడతుమ్మెదవలే ఉన్నది. మంగళ దేవత యొక్క ఆ చూపు నాకు శుభములనిచ్చు గాక.

నల్లగానున్న తమాలవృక్షము మొగ్గలతో శోభించు నట్లు, శ్యామ వర్ణము గల విష్ణుమూర్తి శరీరము అలంకారములతో శోభించు చున్నది. ఆడతుమ్మెదలు మొగ్గల చుట్టూ తిరుగుచూ సంతోషించునట్లే, విష్ణుమూర్తిని ఆశ్రయించిన, సకలైశ్వర్యములకు పుట్టినిల్లయిన లక్ష్మీదేవి యొక్క కృపాకటాక్షము నాకు మంచిని కలిగించు గాక!

పూల మొగ్గలతో నిండియున్న తమాల వృక్షము (కానుగచెట్టు)ను ఒక ఆడుతుమ్మెద ఆశ్రయించుకొనియున్నట్లు, సంతోషముతో పులకరించిన శరీరము గల విష్ణుదేవుని హృదయమును నివాసముగా చేసికొన్న సకలైశ్వర్య సంపన్నురాలైన లక్ష్మీదేవి యొక్క క్రీగంటి చూపు, నాపై ప్రసరించి శుభములు చేకూర్చును గాక.

'ఆడు తుమ్మెద' 'మొగ్గలచే అలంకృతమైన తమాలవృక్షమును ఆశ్రయించి ఉన్నట్లు' పులకాలంకృతమైన శ్రీహరి శరీరమును ఆశ్రయించియున్నదై, సకలైశ్వర్యములను శరీరముగాఁ జేసికొన్న మంగళదేవతయైన శ్రీ మహాలక్ష్మి క్రీగంటిచూపు నాకు మంగళపరంపర నిచ్చునది యగుగాక.

02. ముగ్ధా ముహుర్విదధతీ వదనే మురారేః
ప్రేమత్రపా ప్రణిహితాని గతాగతాని!
మాలా దృశోర్మధుకరీవ మహోత్పలే యా
సా మే శ్రియం దిశతు సాగర సమ్భవా యాః॥

కమలము చుట్టు పరిభ్రమించు తుమ్మెద వలె విష్ణుమూర్తి యొక్క మోముపై వెల్లువలెత్తిన ప్రేమను మాటి మాటికిని ప్రసరింపజేయు శ్రీ మహాలక్ష్మీదేవి కటాక్ష పరంపర నాకు సంపదల ననుగ్రహించుగాక!

తామరపువ్వువంటి విష్ణుమూర్తి ముఖముపై ప్రేమతోనూ మరియు సిగ్గుతోనూ మరల ప్రసరించుచూ వెనుదిరుగుచున్న ఆడతుమ్మెద వంటి లక్ష్మీదేవియొక్క ముగ్ధమైన చూపులవరస నాకు సంపదనిచ్చు గాక.

కలువపూవు చుట్టూ మాటిమాటికి తిరుగుచున్న ఆడ తుమ్మెద వలె విష్ణువు యొక్క ముఖ కమలమును చూచుచు ప్రేమతోను, సిగ్గుతోను కూడిన దృష్టి గలదై యున్న సముద్ర కన్యయైన లక్ష్మీదేవి యొక్క దృష్టి నాకు శ్రేయస్సును కలిగించుగాక!

నీలి కలువ మీద తుమ్మెదలు వ్రాలినట్లు, విష్ణుదేవుని మొగము మీద శ్రీదేవి చూపులు వ్రాలుచుండును. ఆయన తనను చూచుచున్నాడని సిగ్గుపడి ఆమె చూపులు వెనుకకు మరలును. ఇట్లు శ్రీహరి ముఖము మీదికి రాక పోకలు జరుపుచున్న లక్ష్మీదేవి చూపులు ఒక్కసారి ఈ భక్తునిపై ప్రసరించి సర్వసంపదలు ఇచ్చుగాక.

ముద్దరాలై యెవతె మురారి ముఖమునందు, 'పద్మమునందు ఆడు తుమ్మెదవలె' ప్రేమతో సిగ్గుతో గూడిన మాలాకృతిగల చూపుల రాకపోకలను చేయుచుండునో, అట్టి క్షీరసాగర కన్య చూపులమాల నాకు సంపదల నిచ్చుగాక.

03. ఆమీలితాక్ష మధిగమ్య ముదా ముకున్దమ్ (4)
ఆనన్దకన్ద మనిమేష మనఙ్గతన్త్రమ్।
ఆకేకర స్థిత కనీనిక పద్మ(క్ష్మ)నేత్రం
భూత్యై భవేన్మమ భుజఙ్గ శయాఙ్గనాయాః॥

కన్నులు మూసుకొన్న ముకుందుని సంతోషముతో చేరి ఆనందముతో నిండినది, రెప్పపాటులేనిది, మన్మథ తంత్రమైనది, కంటిచివర నిలచిన కనుగ్రుడ్లు మరియు రెప్పలు కలది అగు శేషసాయి సతీమణి చూపు నాకు ఐశ్వర్యము నిచ్చుగాక.

ఎల్లప్పుడు ఆనందమిచ్చుచున్న కొద్దిగా తెఱచిన నేత్రములు గలవాడు, మన్మథుని వశము చేసికొనిన రూపము గలవాడు, శేషశాయి మీద పవళించిన వాడు అయిన మహావిష్ణువు యొక్క పత్ని లక్ష్మీదేవి, సగము మూసిన స్థిరమైన కనుపాపలతో పద్మము వంటి కనులు కలిగినటు వంటిదైన కళ్యాణ రూపిణి నాకు కళ్యాణము కలిగించుగాక!

కోరికతో నిండిన అరమూత కన్నులతో తనను చూచుచున్న శ్రీహరినిచ ప్రేమతో రెప్పవేయకుండా కంటికొనలతో చూచుచున్న ఆ ఇందిరాదేవిచూపు, కొంచెము నాపై ప్రసరించి నాకు సంపదల నిచ్చుగాక.

సంతోషముతో కన్నులు మూతపడి యున్న శ్రీమహావిష్ణుమూర్తిని పొంది, ఆనందమునకు మూలమై, రెప్పపాటు లేక మన్మథ పరవశమై, కొంచెమోరగనున్న నల్లగ్రుడ్లు ఱెప్పలుగల శేషశాయి యిల్లాలి (శ్రీలక్ష్మీదేవి) చూపు నాకు సంపద నిచ్చునది యగుఁగాక.

04. బాహ్వాన్తరే మధుజితః శ్రితకౌస్తుభే యా (5)
హారావలీవ హరినీలమయీ విభాతి!
కామప్రదా భగవతోఽపి కటాక్షమాలా
కళ్యాణమావహతు మే కమలాలయా యాః॥

శ్రీ మహావిష్ణువు యొక్క వక్షఃస్థలములోని కౌస్తుభ మణి నాశ్రయించి దాని లోపల, వెలుపల కూడా ఇంద్రనీల మణిహారములవంటి ఓరచూపులను ప్రసరింపజేయుచు కోరికలను తీర్చు లక్ష్మీదేవి నాకు శ్రేయస్సును చేకూర్చు గాక!

కౌస్తుభమణికల విష్ణుమూర్తి వక్షస్థలమునందు ఇంద్రనీల మణిహారమువలే విరాజిల్లుచున్నది. నారాయణునకు కూడ కోరికలను తీర్చునది అగు లక్ష్మీ కటాక్షము నాకు కళ్యాణము నిచ్చుగాక.

కౌస్తుభమణిచే శోభిల్లుచున్న వక్షస్థలము గల మరియు మధు రాక్షసుని జయించిన విష్ణుమూర్తి హృదయము నందును, బయటను, ఇంద్రనీల మణిమాల వలె ప్రకాశించుచున్న లక్ష్మీదేవి, విష్ణువు కోర్కెలను కూడా ఈడేర్చుచు కమలమే నివాస స్థానముగా కలిగియున్నది. ఆమె యొక్క కృపాదృష్టి నాకు మంచి కలిగించు గాక!

ఏ శ్రీదేవి యొక్క కడగంటి చూపులు కౌస్తుభమణితో వెలుగొందు శ్రీహరి హృదయమందు ప్రసరించి, ఇంద్ర నీలమణి హారాలవలె ప్రకాశించుచున్నవో, ఏదేవి చూపులు భర్తయైన విష్ణుదేవునికి గూడ కోరిన కోరికలు తీర్చుచున్నవో అటువంటి లక్ష్మీదేవి చూపులు నాకుశుభములను ప్రసాదించుగాక.

కౌస్తుభమణి దాల్చిన మధుసూదన దేవుని వక్షస్థలమునందు ఇంద్రనీల మణిమయ హారముల వరుసవలె నెవతె ప్రకాశించుచున్నదో, భగవంతునకు కోరిన కోరికల నిచ్చునట్టి కమలాలయ (లక్ష్మీదేవి) కటాక్షము నాకు మంగళమును కలిగించు గాక.

05. కాలామ్బుదాళి లలితోరసి కైటభారేః (6)
ధారాధరే స్ఫురతి యా తటిదఙ్గనేవ।

మాతుస్సమస్త జగతాం మహనీయమూర్తిః
భద్రాణి మే దిశతు భార్గవ నన్దనా యాః॥

విష్ణుమూర్తి నేలమేఘసన్నిభమైన వక్షఃస్థలమునందు విలసిల్లు మహనీయ మూర్తి, సకల జగన్మాత, శ్రీ మహాలక్ష్మి భగవతి నాకు సమస్త శుభములను గూర్చుగాక!

నల్లనిమేఘములవంటి కాంతికల విష్ణుమూర్తి వక్షస్థలముపై నివసించు లక్ష్మీదేవి కారుమబ్బుపై మెరుపు తీగవలే ప్రకాశించు చున్నది. సమస్త ప్రపంచములకు తల్లియైన భార్గవియొక్క మహనీయ స్వరూపము నాకు భద్రములనిచ్చుగాక.

వర్షించుటకు సిద్ధముగా నున్న నల్లని మేఘముల వంటి దేహచ్ఛాయ గలిగిన, కైటభ రాక్షసుని శత్రువైన విష్ణుని వక్షఃస్థలముపై ప్రకాశించు మెఱుపువలె ఉన్నది శ్రీదేవి. సమస్త జగత్తులకు తల్లియైనటువంటి పూజ్యురాలైన ఆ భృగు తనయ, లక్ష్మీదేవి మాకు క్షేమము కలిగించుగాక!

కారుమబ్బుల మీద కాంతి రేఖవలె విష్ణుమూర్తి హృదయము మీద మెరసిపోవుచుండు లక్ష్మీదేవి యొక్క దివ్య స్వరూపము నాకు సర్వ శుభములను ఇచ్చుగాక.

కైటభారి (విష్ణుని) నల్లని మేఘమాలవలె అందమైన వక్షస్థలమునందు నీలమేఘమునందు మెఱుపుతీగఁవలె నెవతె మెఱయుచున్నదో, సకల లోకములకు తల్లియైన లక్ష్మీదేవి యొక్క మూర్తి నాకు మంగళముల నిచ్చుఁగాక.

06. ప్రాప్తం పదం ప్రథమతః ఖలు యత్ప్రభావాత్ (7)
మాఙ్గల్యభాజి మధుమథిని మన్మథేన।
మయ్యాపతేత్తదిహ మన్థర మీక్షనార్థం
మన్దాలసం చ మకరాలయ కన్యకాయాః॥

శ్రీ విష్ణుమూర్తి యొక్క మనస్సునందు మన్మధునకు స్థానము కల్పించిన లక్ష్మీదేవి యొక్క నెమ్మదైన మఱియు ప్రసన్నమైన ఓరచూపు నా మీద ప్రసరించు గాక!

మంగళనిలయుడైన మధుసూదనునిలో మన్మథుడు ప్రవేశించుటకు కారణమైనది, మందముగా ప్రసరించునది అగు లక్ష్మీకటాక్షము నాపై మెల్లగా పడుగాక.

ఎవరి ప్రభావము వలన మొదట మధువను రాక్షసుని చంపగల మంగళకార్యము విష్ణువు నకు కలిగెనో, (మన్మథేన అనగా మోహన కరమైన రూపము మధు కైటభులకు చూపించి వారికి అహంకారము కలిగించి, విష్ణువునకు వారిని చంపగలిగే వరము యిప్పించినది) విష్ణువు హృదయ స్థానమును అలంకరించినదైన, సముద్ర కన్యయైనట్టి లక్ష్మి నెమ్మదిగా, నిమీలిత నేత్రదృష్టిని నాపై ప్రసరించు గాక!

మంగళ స్వరూపిణియైన లక్ష్మీదేవి యొక్క కడకంటి చూపు, శ్రీమహావిష్ణువు నందు ప్రసరించుట చేత, ఆయన లోకరక్షణ కృత్యమును నెరవేర్చ గలుగుచున్నాడు. అటువంటి క్షీరసాగరకన్య యొక్క క్రీగంటిచూపు నామీద పడి నన్ను ధన్యుని చేయుగాక.

ఏ ప్రభావముచే మన్మథుడు (మనస్సు) కల్యాణములను పొందెడి విష్ణువునందు ప్రసిద్ధమైన స్థానమునాక్రమించెనో, అట్టి మథించు స్వభావముకల ప్రకాశములేక నిద్రించునట్లుండెడి లక్ష్మీదేవి యొక్క క్రీగంటి చూపు నాయందు ప్రసరించుగాక!

07. విశ్వామరేన్ద్ర పదవిభ్రమ దానదక్షమ్ (3)
ఆనన్ద హేతురధికం మురవిద్విషోఽపి।
ఈషన్నిషీదతు మయి క్షణమీక్షణార్ధమ్
ఇన్దీవరోదర సహోదర మిన్దిరాయాః॥

దేవేంద్ర పదవిని సైతము ప్రసాదింపగలిగిన, ఎల్ల ఆనందములకును మూలమైన, భగవాన్ విష్ణుమూర్తికి సైతము మన్మథ బాధను కలిగింపగల శ్రీ మహాలక్ష్మీ మాత నేత్ర కమలములు నాకు సంపదలను కటాక్షించు గాక!

దేవేంద్ర పదవిని కూడ ఇవ్వగలిగినది, విష్ణుమూర్తికి కూడ అధికానందమును కలిగించునది, నల్ల కలువకు సోదరివంటిది అగు లక్ష్మీదేవి అరచూపు ఒక్క క్షణమైననూ కొంచెముగా నాపై నిలుచుగాక.

మురాసురుని శత్రువైనటువంటి విష్ణువు, దేవతలకు ఆధిపత్యమును, వైభవమును ఇచ్చుటకు సమర్థత గలిగినను, ఆ విష్ణువుకే అధిక ఆనంద కారణమైనది బ్రహ్మ సహోదరియైన లక్ష్మీదేవి యొక్క కృపాదృష్టి నాపై క్షణము స్థిరముగా ఉండుగాక!

ఇంద్రునకు త్రిలోక సామ్రాజ్యమును ప్రసాదింపగలదియు, నారాయణునకు ఆనందము కలిగించునదియు అయిన, లక్ష్మీదేవి యొక్క చూపులో సగము నాపై ఒక్క క్షణ కాలము నిలిచి నన్ను అనుగ్రహించు గాక.

సకల దేవరాజులకు వారివారి పదవీ విలాసముల నిచ్చుటకు సమర్థమైనది, మురారికిని విశేషముగ ఆనందకారణమైన పద్మగర్భ సోదరియైన లక్ష్మీదేవి సగము చూపు కొంచెముగా నామీద ప్రసరించుగాక

08. ఇష్టా విశిష్టమతయోఽపి యయా దయార్ద్ర (9)
దృష్ట్యా త్రివిష్టపపదం సులభం లభన్తే।
దృష్టిః ప్రహృష్ట కమలోదర దీప్తిరిష్టాం
పుష్టిం కృషీష్ట మమ పుష్కర విష్టరాయాః॥

ఆ తల్లి కరుణార్ద్ర దృష్టివలన ఆశ్రుతులైన పండితులకు స్వర్గప్రాప్తి కలుగుతుంది. విష్ణుమూర్తినే అలరించునట్టి వెలుగుతో విలసిల్లు ఆ కమలాసనురాలైన లక్ష్మీదేవి నాకు కావలసిన విధముగా సంపన్నతను పొనరించు గాక!

సామాన్యమైన మతికలవారు కూడ కమల వాసినియగు లక్ష్మీదేవియొక్క ఏ దయార్ద్రదృష్టిచే స్వర్గసుఖములను సులభముగా అనుభవించుచున్నారో, వికసితపద్మగర్భము వంటి కాంతి కల ఆ దృష్టి నాకు ప్రియమైన పుష్టిని కలిగించుగాక.

ఏ తల్లి కృపాదృష్టి వల్ల ఇష్టప్రాప్తియు, విశేషమైన వివేక బుద్ధియు మానవులు పొందుచున్నారో, మరియు ఎవరి కృపాదృష్టి వల్ల నరులు సులభముగా స్వర్గమును పొందుచున్నారో అట్టి వికసించిన కమలముల వంటి నేత్రశోభ కలిగి, పద్మముపై విరాజిల్లుచున్న లక్ష్మీదేవి కృపాదృష్టి నా మనోవాంఛితములను, నిండైన పుష్టిని, ప్రయత్నాభీష్టమును కలిగించు గాక!

యజ్ఞయాగాదులు చేయకపోయినను, మానవులు ఏ మహాదేవి చూపులు సోకుటవలన, దేవేంద్ర పదవిని గూడ పొందుచున్నారో, అటువంటి పద్మాసనయు, పద్మవర్ణము గలదియు అయిన శ్రీదేవి యొక్క చూపు మాపై నిలిచి మేము కోరిన సంపదలిచ్చుగాక.

లక్ష్మీదేవి యొక్క దయార్ద్ర దృష్టి వలన (అ) విశిష్టమతులు సులభముగా స్వర్గమును పొందుచున్నారు. అటువంటి శ్రీయొక్క బాగుగా వికసించిన పద్మకర్ణికాతుల్య ప్రకాశం వంటి చూపు, నాకు హితమైన పుష్టిని కలిగించు గాక!

09. దద్యాద్దయాను పవనో ద్రవిణాంబుధారా (8)
మస్మిన్న కిఞ్చన విహఙ్గ శిశౌ విషణ్ణే।
దుష్కర్మ ఘర్మ మపనీయ చిరాయ దూరం
నారాయణ ప్రణయినీ నయనామ్బువాహః॥

లక్ష్మీదేవి చల్లని చూపులు ఈ దరిద్రుడనెడి విచారగ్రస్తునిపై దయతో వాలి, ఈ దారిద్ర్యమునకు కారణమైన పూర్వ జన్మల పాపకర్మలను తొలగద్రోసి, నా మీద ధనమనెడి వాన సోనలను ధారాళముగా కురియించు గాక!

విలవిలలాడు పక్షి శిశువువలే బాధ పడుచున్న ఈ దరిద్రునిపై దయ అనే వాయువుచే కదల్చబడిన లక్ష్మీ కటాక్షమనే మేఘము, చెడు కర్మలనే మండుటెండను దూరముగా ఎల్లప్పటికీ తొలగించి సంపదలనే జలధారను వర్షించు గాక.

శ్రీమన్నారాయణుని పత్నియైన లక్ష్మీదేవి, వర్షాధారము వంటి మేఘముల వలె కరుణ రసము కురిపించు నేత్రములు గలదై, దయా రూపమైన అనుకూల వాయువుతో భరించరాని ఎండను దూరముగా తరిమివేసి, పక్షి కూనవలె విషాదముతో మునిగియున్న నాయందలి దారిద్ర్యమును తొలగింప జేయు ధనమను జలమును వర్షించుగాక! (ఎండలో దాహము వేసి నీటికై తహతహలాడుచున్న పక్షికూనను వర్షము కురిపించి రక్షించునట్లుగా నాయొక్క దారిద్ర్యమును తొలగించు జల ప్రవాహముగా ధనమును ప్రసాదించుగాక!)

(చాతకపక్షి మేఘాల నుండి పడుచున్న వర్షపు నీటిని త్రాగి తృప్తి పొందును) ఎండవేడికి తపించిన పిల్ల చాతకపక్షి మేఘముల గాలి తగలగానే వర్షంలో తృప్తి నొందించినట్లు, పాపములతో తపించుచున్న ఈ అభాగ్యుని, దయతో గూడిన లక్ష్మీదేవి చూపు సంపదలిచ్చి తృప్తిని పొందించుగాక.

లక్ష్మీదేవి యొక్క దృష్టియనెడు మేఘము దయావాయువుచే ప్రేరేపింపబడినదై, చాలా కాలముగా నున్న దుష్కర్మ మనెడు స్వేదమును తొలగించి, ఈ దుఃఖితుడైన దరిద్రుడను చేతక శిశువునందు ధన వర్షధార ఒసంగు గాక!

10. గీర్దేవతేతి గరుడధ్వజ సుందరీతి (10)
శాకంభరీతి శశిశేఖర వల్లభేతి।
సృష్టి స్థితి ప్రళయకేళిషు సంస్థితాయా
తస్యై నమస్త్రిభువనైక గురోస్తరుణ్యై॥

విష్ణుమూర్తికి భార్యయైన లక్ష్మిగా, బ్రహ్మదేవుని పత్నియైన సరస్వతిగా, సదాశివుని అర్ధాంగియైన అపరాజితగా, శాకంభరీదేవిగా – ఇట్లనేక రూపములతో ఏ విశ్వమాత సృష్టి, స్థితి, ప్రళయ లీలను సాగించు చున్నదో, ఆ విశ్వాత్మకుడైన పరమ పురుషుని ఏకైక ప్రియురాలికి నమోన్నమః।

వాగ్దేవి అని, విష్ణుపత్ని అని, శాకంభరి అని, శాంభవి అని పిలువబడుచూ సృష్టి – స్థితి – లయలను నడిపించు జగన్మాతకు నమస్కారము.

సృష్టి సమయమున వాగధిష్ఠాన దేవతయైన సరస్వతి అనియు, స్థితి కాలమున గరుడ ధ్వజుడైన విష్ణుమూర్తి యొక్క సుందరమైన పత్ని అనియు, ముల్లోకములలో ప్రసిద్ధి చెందిన విష్ణుపత్నియైన శాకంభరి (కరువు కాలములో కూడ శాతుల రూపములో జనులను రక్షించునది గాను) అనియ (స్థితి కారకురాలు), ప్రళయ కాలమున చంద్రశేఖరుని శ్రీమతి యైన కాళిగాను, మూడు రూపములతో యున్న లక్ష్మీదేవికి, మూడులోకములకు జగద్గురువైన విష్ణుపత్నికి నా నమస్కారములు.

సృష్టి కాలమున బ్రహ్మపత్నియైన సరస్వతి అనియు, పోషణ కాలమున నారాయణ పత్నియైన లక్ష్మీదేవి యనియు భక్తుల ననుగ్రహించుటలో అన్నపూర్ణదేవి (శాకంభరి) అనియు, ప్రళయ కాలమున రుద్రుని పత్నియైన పార్వతి యనియు చెప్పబడుచున్న విష్ణుపత్నియైన లక్ష్మీదేవికి నమస్కారము.

వాణిగా, గరుడధ్వజుని భార్యగా, శాకంభరిగా, శశిశేఖర వల్లభగా సృష్టి - స్థితి - లయములను క్రీడలో బాగుగా నిలిచియున్నటు వంటి; త్రిభువనములకు గురువైన పరమాత్మకు అర్ధాంగియగు పరాశక్తి కొరకు నమస్కారము.

11. శ్రుత్యై నమోఽస్తు శుభకర్మ ఫల ప్రసూత్యై
రత్యై నమోఽస్తు రమణీయ గుణార్ణవాయై।
శక్త్యై నమోఽస్తు శతపత్ర నికేతనాయై
పుష్ట్యై నమోఽస్తు పురుషోత్తమ వల్లభాయై॥

శుభముల నొసంగు వేదమాతృ రూపురాలైన లక్ష్మీదేవికి, ఆనందగుణ సముద్రము వంటిదగు రతీదేవి స్వరూపురాలైన బార్గవీమాతకు, నూరు దళముల పద్మముపై ఆసీనురాలైన శక్తి స్వరూపురాలికి, విష్ణుమూర్తికి ప్రియురాలైన పుష్టిస్వరూపురాలగు ఇందిరాదేవికి దండములు.

శుభకర్మఫలములను కలిగించు శ్రుతికి నమస్కారము. రమణీయ గుణసాగరమైన రతికి నమస్కారము. వందరేకులు కల పద్మమునందు నివసించు శక్తికి నమస్కారము. పురుషోత్తముడైన నారాయణుని ప్రియురాలగు పుష్టికి నమస్కారము.

వేద రూపిణియై శుభ కర్మలతో కూడిన దేవికి నమస్కారము. రత్నములకు ఆలవాలమైన సాగరము వలె, రమణీయ గుణములకు ఆకారమైన రతిరూపిణికి నమస్కారములు. కమలమునే వాసస్థానముగా చేసుకున్న శక్తి రూపిణికి నమస్కారము. పురుషోత్తముడైన విష్ణువు యొక్క స్ఫూర్తిని కలిగించు లక్ష్మీదేవికి నమస్కారములు.

శుభ కర్మలకు మూలకారణమైన వేదస్వరూపిణియు, మహోన్నత గుణములకు పుట్టినిల్లైన ఆనందరూపిణియు, పద్మము పీఠముగా గల శక్తి రూపిణియు, సకల సంపత్స్వరూపిణియు అయిన, విష్ణుదేవుని ఇల్లాలైన లక్ష్మీదేవికి నమస్కారము.

పుణ్యకర్మల ఫలము ననుగ్రహించు శ్రుతి రూపిణి, మనోహరగుణ సముద్రయైన రతిరూపిణి, శతపత్ర పద్మ నివాసినియగు శక్తిరూపిణి అగు పరమపురుషుని ఇల్లాలైన పుష్టిరూపిణియైన లక్ష్మికి నమస్కారమగు గాక.

12. నమోఽస్తు నాళీక నిభాననాయై।
నమోఽస్తు దుగ్ధోదధి జన్మభూమ్యై॥
నమోఽస్తు సోమామృత సోదరాయై।
నమోఽస్తు నారాయణ వల్లభాయై॥

పద్మము వంటి ముఖము గలిగినది, పాల కడలిలో జన్మించినది, అమృతమునకును చంద్రునికిని తోబుట్టువైనది, నారాయణునకు ప్రేమస్పదురాలైనది అయిన లోకమాతకు దండములు.

పద్మమువంటి ముఖముకల లక్ష్మికి నమస్కారము. పాల సముద్రమే జన్మస్థానముగా గల లక్ష్మికి నమస్కారము. చంద్రునకు మరియు అమృతమునకు సోదరి యగు లక్ష్మికి నమస్కారము.

కమల పుష్ప సమానమైన ప్రకాశవంతమైన ముఖము కలిగిన లక్ష్మికి నమస్కారములు. పాల సముద్రమే జన్మభూమిగా గల ఆమెకు నమస్కారము. చంద్రునికి, అమృతమునకు సోదరిగా జన్మించిన ఆమెకు నమస్కారము. నారాయణుని ప్రియపత్నికి నమస్కారము.

తామరపువ్వువంటి ముఖము గల తల్లికి నమస్కారము. పాలసముద్రము పుట్టినిల్లుగా గల దేవికి నమస్కారము. చంద్రునకు, అమృతమునకు సోదరియైన చల్లని తల్లికి ప్రణామము. నారాయణునికి ప్రియురాలైన అమ్మకు వందనము.

పద్మమువంటి ముఖము కలదియు, క్షీర సాగరము జన్మభూమిగా కలదియు, చన్ద్రునకు - అమృతునకు (ధన్వంతరికి) సహోదరియు అగు నారాయణికి నమస్కారము.

13. నమోఽస్తు హేమామ్బుజ పీఠికాయై
నమోఽస్తు భూమండల నాయికాయై।
నమోఽస్తు దేవాది దయాపరాయై
నమోఽస్తు శార్ఙ్గాయుధ వల్లభాయై॥

బంగారు పద్మముపై ఆసీనయైనది, సమస్త భూమండలమునకు నాయిక అయినది, దేవాదులకు దయ జూపునది, శార్ఙ్గమను ధనుస్సును ధరించిన విష్ణుమూర్తికి ప్రియముకూర్చునది అయిన శ్రీ కమలాదేవికి దండములు.

బంగారు పద్మము ఆసనముగా కలదియు, భూమండలమునకు నాయికయైనదియును, దేవతలలో దయయే ముఖ్యముగా కలదియును, విష్ణువుకు ప్రియురాలును యైన లక్ష్మీదేవికి నమస్కారము.

బంగారు వన్నెగల పద్మమే ఆసనముగా గల లక్ష్మికి నమస్కారము. భూమండలమున కంతటికి నేతృత్వము గలిగిన ఆమెకు నమస్కారము. దేవతలకు కూడా దయ చూపించు ఆమెకు నమస్కారము. శార్ఙ్గ ధనస్సు ధరించిన విష్ణుపత్నికి నమస్కారము.

బంగారు తామరపువ్వునందు కూర్చున్న దేవికి ప్రణామము. సమస్త లోకములకు నాయకు రాలైన అమ్మకు వందనము. సమస్త దేవతలను కరుణించు స్వభావము గల దయామూర్తికి జోహారు. శారఙ్గమను విల్లు ధరించిన మురారికి ప్రియపత్నియైన లక్ష్మీదేవికి నమస్కారము.

14. నమోఽస్తు దేవ్యై భృగునందనాయై
నమోఽస్తు విష్ణోరురసి స్థితాయై।
నమోఽస్తు లక్ష్మ్యై కమలాలయాయై
నమోఽస్తు దామోదర వల్లభాయై॥

భృగుమహర్షి బిడ్డయైనది, విష్ణువు వక్షఃస్థలము నధివసించి యున్నదియు, కమలములే తన ఆలయములుగా గలదియు నగు దామోదర ప్రియాదేవికి నమస్కారము.

భృగుమహర్షి పుత్రికయును, దేవియును, విష్ణువక్షస్థల వాసినియు, కమలాలయము, విష్ణువుకు ప్రియురాలు యైన లక్ష్మీదేవికి నమస్కారము.

దేదీప్యమానమైన పరమేశ్వరి, భృగుకన్యకు నమస్కారము. విష్ణువు యొక్క హృదయవాసిని యైన లక్ష్మికి నమస్కారము. కమలమే ఆలయముగా కలిగిన ఆమెకు నమస్కారము. (చిన్నతనములో యశోద కృష్ణుని మొలకు త్రాడుతో కట్టిన కారణమున ఆయన దామోదరు డైనాడు) సర్వవ్యాపకుడైన లీలావిగ్రహుని పత్నికి నమస్కారము.

భృగుమహర్షి కుమార్తెయైన భార్గవికి నమస్కారము. విష్ణుదేవుని హృదయముపై విశ్రమించు దేవికి నమస్కారము. పద్మమే నివాసముగా గల, తల్లికి వందనము. శ్రీమన్నారాయణునికి ప్రియురాలైన అమ్మకు ప్రణామము.

15. నమోஉస్తు కాన్త్యై కమలేక్షణాయై
నమోஉస్తు భూత్యై భువన ప్రసూత్యై।
నమోஉస్తు దేవాదిభి రర్చితాయై
నమోஉస్తు నన్దాత్మజ వల్లభాయై॥

కమలముల వంటి కన్నులు గల కాంతిస్వరూపురాలికి సకల భువనములకు తల్లియైనది, దేవాదులచే పూజింపబడునది, నందకుమారుడైన శ్రీకృష్ణ పరమాత్ముని ప్రేమను చూరగొన్నదియగు శ్రీదేవికి దండములు.

తామర పువ్వుల వంటి కన్నులు కలదియు, దేదీప్యమానమైనదియు, లోకములకు తల్లియు, దేవతలచే పూజింపబడునదియు, విష్ణువుకు ప్రియురాలు నగు లక్ష్మీదేవికి నమస్కారము.

తామర రేకుల వంటి కన్నులతో ప్రకాశవంతమైన దృష్టి గలిగిన ఆమెకు నమస్కారము. సకలైశ్వర్యములకు, సకల భువనములకు కారకురాలైన ఆమెకు

నమస్కారము. ఇంద్రాది దేవతల ద్వారా అర్చింప బడుచున్న ఆమెకు నమస్కారము.
నందతనయుడైన కృష్ణుని ప్రియసఖికి నమస్కారము.

కాంతి స్వరూపిణి - కమల నేత్రయు అయిన లక్ష్మికి నమస్కారము. భాగ్యరూపిణియు జగత్ సృష్టికి కారణ భూతురాలైన కమలాదేవికి నమస్కారము. దేవతలచే పూజింపబడు దేవికి నమస్కారము. నందగోపుని కుమారుడైన శ్రీకృష్ణుని దేవేరియు రుక్మిణీ రూపిణియుయైన లక్ష్మీదేవికి నమస్కారము.

16. సమ్పత్కరాణి సకలేంద్రియ నన్దనాని
సామ్రాజ్యదాన విభవాని(నిరతాని) సరోరుహాక్షి!
త్వద్వన్దనాని దురితా హరణోద్యతాని
మామేవ మాతరనిశం కలయన్తు మాన్యే॥

తల్లీ! మహాలక్ష్మీ! మేము నీకు జేయు వందనములు మాకు సంపదలను, సుఖములను గలిగించునవి. సామ్రాజ్యమును సైతము ప్రసాదింప జాలినవి, పాపములను హరించునవి. అవి నన్నెల్లప్పుడును వీడకుండును గాక!

పద్మములవంటి కన్నులు కల పూజ్యురాలైన ఓ తల్లీ! సంపదలు కలిగించునవి, ఇంద్రియము లన్నింటినీ ఆనందింపచేయునవి, సామ్రాజ్యమునిచ్చు సామర్థ్యము కలవి అగు నీకు చేయువందనములు నన్ను ఎల్లప్పుడూ కలసి ఉండుగాక.

కమల పత్రముల వంటి కన్నులు కలిగిన ఓ తల్లీ! పూజనీయురాలైన తల్లీ! నీకు నమస్కారము. పాపములను హరించుటకు ఉద్యుక్తములైనవి ధనసంపదలు సామ్రాజ్యము మాకు నిరంతరము సమకూర్చును గాక! సకలేంద్రియములకు తృప్తి కలుగుగాక!

పూజ్యురాలైన ఓ తల్లీ! నీకు నేను చేయు నమస్కారములు నాకు సంపదలు గలిగించును. కన్నులు మొదలైన ఇంద్రియములకు ఆనందము నిచ్చును. సామ్రాజ్యములే ఇచ్చును. అంతే కాదు - నేను చేసిన పాపములను గూడ పోగొట్టును. అటువంటి నమస్కారములు నన్ను పవిత్రుని చేయుగాక.

పద్మలోచనయైన తల్లీ! పూజ్యురాలా! సంపదలు కలిగించునవి, సకలేంద్రియములను సంతసింపజేయునవి, సామ్రాజ్యము నిచ్చు వైభవముగలవి,

పాపములను సమూలముగా పోగొట్టుట కుద్యుక్తములైనవి అగు నీ నమస్కారములు ఎల్లప్పుడు నాకే లభించు గాక!

17. యు(శ్రీ)త్కటాక్ష సముపాసనా విధిః
సేవకస్య సకలార్థ సంపదః।
సన్తనోతి వచనాఙ్గ మానసై స్త్వాం
మురారి హృదయేశ్వరీం భజే॥

హే మహాలక్ష్మి! ఎవరి కటాక్షమును గోరుచు మనసా, వాచా, కర్మణా ఉపాసించిన భక్తులకు అష్టైశ్వర్యములు సమకూడునో, అట్టి హరిప్రియవైన నిన్ను శ్రద్ధతో భజించు చున్నాను.

నీ కటాక్షమును సంపాదించుటకై మనోవాక్కాయములతో చేయు సేవ భక్తునకు సమస్త సంపదలను వృద్ధిచేయును. మురారి హృదయేశ్వరియగు నిన్ను సేవించు చున్నాను.

మురారి హృదయేశ్వరియైన లక్ష్మీదేవిని ఎల్లప్పుడు సేవింతుము గాక! ఎవరు తన కటాక్షము ద్వారా మరియు ఉపాసన ద్వారా భక్తులకు సంపూర్ణ ధన సంపదలు యిచ్చుచున్నారో అట్టి లక్ష్మీదేవిని మనోవాక్కాయ కర్మలతో సేవించెదము.

తల్లీ! నీ చూపులు ప్రసరించుటచేత, నిన్ను సేవించు నీ భక్తుడెవ్వడైనను సంపదలు పొందుచున్నాడు. అట్టి దయామూర్తివైన నిన్ను, విష్ణుదేవునికి ప్రియురాలైన నిన్ను, త్రికరణశుద్ధిగా సేవించు చున్నాను.

ఏ తల్లి క్రీగంటి చూపు నారాధించుట సేవకునకు సకల పురుషార్థ సంపదలను సమృద్ధముగఁ గలిగించునో, అట్టి మురారి హృదయేశ్వరివైన నిన్ను వాక్కాయ మానసములతో సేవించెదను.

18. సరసిజ నిలయే(నయనే) సరోజహస్తే
ధవళతమా(రా)ంశుక గంధమాల్య శోభే।

భగవతి హరివల్లభే మనోజ్ఞే
త్రిభువన భూతికరి(రీ) ప్రసీద మహ్యామ్॥

కమలములవంటి కన్నులు గలది, కమలములు చేత ధరించినది, తెల్లని వలువలు గంధము, పూలమాలలతో ప్రకాశించునది, సౌందర్యమూర్తి అయిన శ్రీ మహాలక్ష్మీ! నీవు ముల్లోకములకున్ను సంపదల ననుగ్రహించు దానవు. హే భగవతీ! హరివల్లభా! శ్రీ మహాలక్ష్మీ! నాయందు సంప్రీతురాలవు కమ్ము.

పద్మమునందుండుదానవు, పద్మముచేతిలో ధరించిన దానవు, మిక్కిలి తెల్లనైన వస్త్రము - గంధము - పూలదండలతో శోభిల్లుచున్నదానవు, భగవతివి, హరికి ప్రియురాలవు, మనోజ్ఞమైనదానవు, మూడు లోకాలకు సంపదనిచ్చుదానవు అగు ఓ లక్ష్మీ! నాకు ప్రసన్నురాలు వగుము.

కమల వాసినియు, కమల హస్తయు, అతి తెల్లనయిన వస్త్రమును ధరించి, గంధ మాల్యములతో శోభించుచు ఉన్నది విష్ణుపత్ని. మూడు లోకములకు ఐశ్వర్యమును ప్రసాదించు మనోహర రూపిణియైన హే! మహాలక్ష్మీ! నా మీద ప్రసన్నురాలగుదువు గాక!

తామరపూల వంటి కన్నులు గలదానా! పద్మము చేతిలో కలదానా! తెల్లని పట్టుచీరతోను, గంధములతోను, పూలమాలలతోను ప్రకాశించు దానా! ముల్లోకములకు ఐశ్వర్యములు ప్రసాదించుదానా! విష్ణుపత్నివైన ఓ లక్ష్మీదేవి! నాయందు అనుగ్రహము చూపుము.

పద్మాలయా! పద్మహస్తా! తెల్లని వస్త్రముల, గంధముల, పూల మాలల కాంతిగలదానా! మూండులోకములకు నైశ్వర్యము కలిగించుదానా! భగవతీ! విష్ణు ప్రియా! మనోహారిణీ! నాయెడ ప్రసన్నమగుము.

19. దిగ్ఘస్తిభిః కనక కుమ్భ ముఖావసృష్ట
స్వర్వాహినీ విమల చారుజల ప్లుతాఙ్గీమ్।

ప్రాతర్నమామి జగతాం జననీ మశేష
లోకాధినాథ గృహిణీ మమృతాబ్ధి పుత్రీమ్॥

జననీ! సకల లోకాధినాధునకు గృహిణీ! క్షర సముద్రరాజ పుత్రీ! దిగ్గజముల భార్యలు (ఆడు యేనుగులు) బంగారు కలశముల యందు పట్టి తెచ్చిన ఆకాశగంగ విమల జలములతో అను నిత్యమున్ను స్నానము చేయు జగజ్జననీ! శ్రీ శ్రీ మహాలక్ష్మీ! నీకు ప్రాతఃకాలములో నమస్కరిస్తున్నాను.

దిగ్గజములచే బంగారు కలశముల ద్వారా ఆకాశ గంగా జలముతో అభిషేకించబడునది, జగన్మాతయైనది, సమస్తలోక రక్షకుడైన నారాయణుని భార్యయైనది, అమృత సముద్రమునకు కుమార్తె యైనది అగు లక్ష్మీదేవిని ప్రాతః కాలము నందు నమస్కరించుచున్నాను.

పవిత్రము, నిర్మలమైన ఆకాశగంగను దిగ్గజములు బంగారు కలశములతో జగన్మాతయైన లక్ష్మిని అభిషేకించు చున్నవి. క్షీర సముద్ర రాజ తనయకు, లోకములకు అధిపతియైన విష్ణువు గృహిణిగా విరాజిల్లుచున్న లక్ష్మికి ప్రాతఃకాలమున నమస్కరించు చున్నాను.

దిగ్గజములు సువర్ణ పాత్రములతో గంగా జలములు దెచ్చి అభిషేకించుటచే తడిసిన దేహము కలిగినదియు, జగజ్జననియు, అమృతసాగర పుత్రికయు, సర్వలోకాధినాధుడైన శ్రీమన్నారాయణుని ఇల్లాలును అయిన శ్రీమహాలక్ష్మికి ప్రతిదినము ప్రాతః కాలము నందు నమస్కరించెదను.

దిగ్గజములచే బంగారు కలశములనుండి వంచబడిన ఆకాశగంగ యందలి విమల జలములచే స్నానముచేయింపఁబడిన యొడలు గల్గి క్షీర సాగర పుత్రియైన, అశేషలోక ప్రభువైన శ్రీహరి కిల్లాలైన జగజ్జననిని ప్రాతః స్సమయమున నమస్కరింతును.

ప్రక్షిప్త శ్లోకాలు

20. కమలే! కమలాక్ష వల్లభే త్వం
కరుణాపూర తరఙ్గితైరపాఙ్గైః।
అవలోకయ మామకించనానాం
ప్రథమం పాత్రమకృత్రిమం దయాయాః॥

అమ్మా! కమలాదేవీ! దరిద్రులలోకెల్ల దరిద్రుడను నేనే, అందుచేత నీ కృపకు అందఱి కంటే ముందు నేనే పాత్రుడనగుదును. నా మాటలలో నటన (కృత్రిమత్వము) లేదు. కనుక నీ కరుణాపూరిత కటాక్షముల (ఓరచూపుల)తో నన్నొకమారు చూడుము తల్లీ! దేవీ! ముకుందప్రియా!

ఓ కమలా! కమలాక్షుని ప్రియురాలా! కరుణా ప్రవాహ తరంగములైన కడగంటి చూపులతో నీవు దరిద్రులలో నీదయకు పాత్రమైన మొదటి వానిగా నన్ను చూడుము.

పద్మపత్రముల వంటి కన్నులు గల విష్ణువు యొక్క అర్ధాంగి! దీనులపై స్వాభావికముగా దయ చూపునది, అట్టి దయకు పాత్రుడైన నన్ను పరిపూర్ణ కరుణతో కూడిన క్రీగంటి చూపుతో చూచుగాక!

కమలాక్షుని రాణివైన ఓ కమలాదేవీ! దరిద్రులలో మొదటివాడను, నీదయకు పాత్రుడను అయిన నన్ను కరుణతో నిండిన కడకంటి చూపులతో చూచి అనుగ్రహింపుము.

లక్ష్మీదేవీ! పుండరీకాక్షుని ప్రేయసీ! నీ దయాప్రవాహ తరంగములైన క్రీగంటి చూపులతో, దరిద్రులలో అగ్రగణ్యుఁడను, నీ దయకు కల్లకపట మెఱుఁగని ముఖ్యపాత్రమనైన నన్ను చూడుము.

21. దేవీ ప్రసీద జగదీశ్వరి లోకమాతః (అధికశ్లోకం)
కళ్యాణదా(గా)త్రి కమలేక్షణ జీవనాథే।
దారిద్ర్యభీతిహృదయం శరణాగతం మామ్
ఆలోకయ ప్రతిదినం సదయైరపాంగైః॥

22. బిల్వాటవీమధ్యలసత్ సరోజే (అధికశ్లోకం)
సహస్రపత్రే సుఖసన్నివిష్టామ్।
అష్టాంపదాంభోరుహ పాణిపద్మాం
సువర్ణవర్ణాం ప్రణమామి లక్ష్మీమ్।

మారేడు చెట్ల తోట మధ్యలో వేయి దళముల పద్మమునందు సుఖముగా ఆసీనురాలైనదియు, బంగారు వన్నెతో ప్రకాశించునదియు, బంగారు కమలములను తన చేతినుండి జారవిడచుచున్నదియు నైన శ్రీ మహాలక్ష్మి భగవతికి భక్తితో ప్రణమిల్లుచున్నాను.

మారేడు చెట్ల తోట మధ్యలో వేయి దళముల పద్మము నందు సుఖముగా ఆసీనురాలైనదియు, బంగారు వన్నెతో ప్రకాశించునదియు, బంగారు కమలములను తన చేతి నుండి జారవిడుచు చున్నదియునైన శ్రీ మహాలక్ష్మి భగవతికి భక్తితో ప్రణమిల్లుచున్నాను.

23. కమలాసనపాణినా లలాటే (అధికశ్లోకం)
లిఖితామక్షర పంక్తిమస్య జంతోః।
పరిమార్జయ మాతరంఘ్రిణా తే
ధనికద్వార నివాస దుఃఖదోగ్ధ్రీమ్॥

ధనికుల ఇళ్ల ముంగిట పడికాపులు కాచుమని ఆ బ్రహ్మదేవుడు ఈ హీన జీవి యొక్క నుదుట వ్రాసిన వ్రాతను దయచేసి నీ కాలితో తుడిచివేయుమమ్మా! తల్లీ! శ్రీ మహాలక్ష్మీ!

24. అంభోరుహం జన్మగృహం భవత్యాః (అధికశ్లోకం)
వక్షస్థలం భర్తృగృహం మురారేః
కారుణ్యతః కల్పయ పద్మవాసే
లీలాగృహం మే హృదయారవిందమ్॥

హే పద్మాలయా దేవీ! నీ పుట్టినిల్లు కమలము. మెట్టినిల్లు నీ పతి విష్ణుమూర్తియొక్క వక్షః స్థలమే. పరిశుద్ధమైన నా హృదయము సహితము పద్మమే. కనుక కృపతో నా హృదయమునందు స్థిర నివాసమేర్పరచుకుని, దానిని నీ కేళీ గృహముగా జేసికొనుము.

ఫలశ్రుతి

25. స్తువన్తి యే స్తుతిభిరమూ భిరన్వహం
త్రయీమయీం త్రిభువన మాతరం రమామ్।
గుణాధికా గురుతర భాగ్య భాజినో
భవన్తి తే భువి బుధ భావితాశయాః॥

వేదమాతయు, జగజ్జననియు అయిన శ్రీ మహాలక్ష్మీ భగవతిని ప్రతి దినమున్ను ఈ స్తోత్రము ద్వారా సేవింతురో, వారు తమ సద్గుణములచేత ఇతరుల కంటే అధికులై, విద్వాంసల చేత గౌరవింపబడుచు మిక్కిలి సౌభాగ్య భాగ్యములతో విలసిల్లగలరు.

వేదస్వరూపిణి, త్రిజగన్మాతయగు లక్ష్మిని ఈ స్తుతులతో కొనియాడువారు అధిక గుణవంతులై గొప్ప భాగ్యముల ననుభవించి ఈ లోకములో పండితులచే ప్రశంసించ బడుదురు.

ముల్లోకముల తల్లిని, సర్వవేద స్వరూపిణిని, విష్ణువును రంజింపజేయు లక్ష్మిని ఎవరు పై చెప్పిన శ్లోకములతో ప్రతిదినము స్తుతిని గావించుచున్నారో, వారు సద్గుణ సంపన్నులై, అధిక భాగ్యవంతులై పుడమిలో విద్వాంసుల భావనలను కూడా ఆకట్టుకొను వారగుచుందురు.

మూడువేదాలరాశియైన స్వరూపముగలదియు, ముల్లోకములకు తల్లియైనదియు అగు శ్రీ లక్ష్మీదేవిని, ఈ కనకధారాస్తోత్రముతో స్తుతించిన వారు సుగుణాలు కలవారు, పండితుల మెప్పు పొందినవారును, మహాబాగ్య సంపన్నులును అగుదురు.

వేదత్ర స్వరూపిణియై, త్రిలోకమాతయైన లక్ష్మీదేవిని అనుదినమును ఎవరీస్తుతులతో స్తుతించెదరో, వారు సద్గుణాధికులై, విస్తారమయిన భాగ్యమును పొందువారై యీ భూమిమీఁద విద్వాంసులు మననము చేయు ఆశయములు గలవారలగుచున్నారు.

సువర్ణధారా (కనకధారాస్తవమ్)
స్తోత్రం యచ్ఛంకరాచార్య నిర్మితం
త్రిసంధ్యం యః పఠేన్నిత్యం స కుబేర సమో భవేత్

శ్రీ శంకరాచార్యులు రచించిన కనకధారాస్తవమును ప్రతిదినము, త్రికాలములందు పఠించువాడు కుబేరునితో సమానుడగును.

// ఇతి శ్రీమచ్ఛంకర భగవత్పాదక కృతః కనకధారాస్తవః సంపూర్ణమ్ //

- - - = - - -



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)